

నూజివీడు సబ్ కలెక్టర్‌గా స్మరణరాజ్


స్మరణరాజ్

నూజివీడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ కలెక్టర్‌గా స్మరణరాజ్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారి అయిన స్మరణరాజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న ఎం.వాణి విజయవాడ పీడీ సీఎంఆర్‌వోగా బదిలీ అయ్యారు.



ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికకు సిద్ధం

- మురళీరాజుకు అవకాశం
- కూటమిలో సయోధ్య
- రేపు ఎన్నిక లాంఛనమే

భీమవరం/భీమవరం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21వ తేదీన భీమవరం కలెక్టర్ కార్యాలయంలో కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షు లను ఎన్నుకోనున్నట్టు జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రకటించారు. కూటమి తరపు న ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అభ్యర్థిని ఇప్పటికే ఖరారు చేశారు. పాలకోడేరు మండలానికి చెందిన మురళీరాజును కూటమి ప్రతిపాదిస్తోంది. నరసాపురం నుంచి ప్రాజెక్ట్ కమిటీపై పోటీ ఏర్పడింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అక్కడ ఎమ్మెల్యే నాయకర్ పట్టుబట్టారు. పార్టీ ఆవిర్భావం నుంచి మురళీరాజు తెలుగు దేశం పార్టీకి సేవలందించారు. గత తెలు గుదేశం ప్రభుత్వ హయంలో మురళీ రాజు పేరు తెరపైకి వచ్చింది. వంతుల ప్రాతిపదికన రెండేళ్లు మురళీ రాజు ప్రాజెక్ట్ కమిటీ బాధ్యతలు అప్పగించాలని అప్పట్లో నిర్ణయించారు. అయితే పొత్తూరి రామ రాజుకు అంతిమంగా కమిటీ చైర్మన్‌గా నాడు నియమించారు. మునిసిపాలిటీ ఎన్నికల్లో వ్యయప్రయాసలకు ఓర్చి కష్టపడిన రామ రాజుకు ఇవ్వడం సముచితంగా ఉంటుందని అప్పట్లో రామానాయుడు ప్రతిపాదించారు. దానికే అంతా మొగ్గు చూపి పొత్తూరి రామ రాజుకు ప్రాజెక్ట్ కమిటీ చై ర్మన్‌గా నియమించారు. వైసీపీ హయాంలో నీటి సంఘాలను రద్దు చేశారు. ఎన్నికలు నిర్వహించలేదు. తెలు గుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ నీటి సంఘాలకు ప్రాధా న్యం ఇచ్చారు. ఇప్పటికే నీటి వినియో గదారులు, నీటి పంపిణీ సంఘాలకు పశ్చి మ డెల్టా పరిధిలో ఎన్నిక పూర్తయ్యింది. నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. తెలుగుదేశం కూటమి నేతలే నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వైసీపీ ముందుగానే చేతులెత్తేసింది. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవికి కూడా కూటమి లో పోటీ లేకుండా నేతలు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. మురళీరాజును ప్రతిపాదించారు. నర్సాపురం నియోజకవర్గం నుంచి డిమాండ్ వినిపించినా సరే ఎప్పటినుంచో తెలుగుదేశం పార్టీకి సేవల ందిస్తూ వచ్చిన మురళీరాజు వైపే కూట మి ఆసక్తి చూపింది. తాడేపల్లిగూడెం నియోజకవ ర్గంలో మరో విధమైన ఆవేదన వ్యక్తమైంది. ఇప్పటిదాకా ప్రకటించిన నా మినేటెడ్, ఇతర పదవుల్లో తాడేపల్లిగూడెం నియోజక వర్గానికి ప్రాధాన్యం దక్కలేదు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గడచిన 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ అధికారంలో లేదు. తాజాగా పదవుల కేటాయింపులో తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువె ళ్లాలని జిల్లా నాయకత్వంపై ఒత్తిడి పెంచారు. ప్రాజెక్ట్ కమిటీ విషయంలో మురళీరాజువైపే మొగ్గుచూపారు. ఎన్నిక లాంచనప్రాయం కానుంది. ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 14 డీసీలు, తూర్పు గోదావరి జిల్లా నుంచి 2 డీసీలు, ఏలూరు జిల్లా నుంచి 4 డీసీలు మొత్తం 20 నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో డెల్టా ప్రాజెక్ట్ కమిటీకి ఒక అధ్యక్ష, ఒక ఉపాధ్యక్ష పదవులను ఎన్నుకోవడం జరుగుతుంది.

మార్కెట్ విలువ.. ఇక చుక్కలే!



పాత మార్కెట్ విలువలను సవరించి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచబోతున్నారు. గత ఏడాదిన్నర క్రితమే వైసీపీ ప్రభుత్వం జనంపై భారం వేసింది. ఇప్పుడు తాజాగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూమి విలువ ను సవరించి నిర్ణయం తీసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి పాదిత భూమి విలువ పెంపుపైనా జిల్లా స్థాయిలో ప్రత్యేక కసరత్తు జరిగింది. ఈనెల 27 నాటికి తుది ప్రతిపాదనలకు సిద్ధమవుతున్నారు. ఆ తదుపరి ఎప్పటి నుంచి భూమి విలు వను నిర్ధారించి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచనుందో అధికారికంగా ఖరారు చేస్తారు.

త్వరలో పెరగనున్న భూమి విలువ

- ఆ మేరకే రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు
- కీలక ప్రాంతాల్లో 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం
- ఈ నెలాఖరుకు తుది ప్రతిపాదనలు ఖరారు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

చాన్నాళ్ళ తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూమి విలువ పెరగబోతుంది. సాధారణంగా డిమాండ్‌ను బట్టి మార్కెట్ విలువలను ఏడాది, రెండేళ్ళకోసారి ప్రభుత్వం సవరిస్తుంది. రిజిస్ట్రేషన్ చార్జీలు ఆ మేరకే పెరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పెంపు ప్రతిపాదనలను సూచాయగా చర్చించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదిత పెంపు విలువలోను సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచుతారు. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈనెల 24లోపు తెలపాల్సి ఉంటుంది. వాస్తవానికి జిల్లా పరిధిలో ఏలూరు కార్పొరేషన్, పరిసరాల్లోని భూమి విలువ అత్యల్పంగా ఉంది. గడిచిన ఐదేళ్ల పాటు భూలావాదేవీలు భారీగా క్షీణించాయి. రియల్ ఎస్టేట్ దాదాపు కుప్ప కూలింది. భూమి విలువ పెంచినా ఎక్కడా పుంజుకోలేదు. వ్యవసాయ భూములను కన్వెర్ట్ చేసి నిర్మాణాలకు వీలుగా మార్చిన ప్పుడు భూమి విలువ భారీగా పెరిగింది. ఏలూరు శివారులలో ఎకరా ఒక్కింటికి రూ.80 లక్షల నుంచి రూ.కోటి 20 లక్షల స్థాయి వరకు విలువ పెరిగింది. సాధారణంగా నగరం, నగర శివారు ల్లోను విలువలు అమాంతంగా మారుతుంటాయి. దీనికి తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ విలువలను ఇప్పుడు సవరిస్తే స్టాంపు డ్యూటీ ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం లభించబోతుంది. ఈ సమయంలో కొనుగోలుదారుడిపై మరింత భారం పడనుంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని గడిచిన కొద్ది రోజులుగా ప్రచారం సాగుతుండడంతో ఆ మేరకు అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను లావా దేవీలు ఇప్పటికే పుంజుకున్నాయి. వాస్తవానికి ఇంతకుముందు భూమి విలువ పెంచి నిర్ధారిం చినప్పుడు ఆ మేరకు రిజిస్ట్రేషన్ చార్జీలను ఖరారు చేసినప్పుడు ఏలూరు నగర శివారులలో గజం రూ.ఐదు వేల నుంచి రూ.ఏడు వేలకు పెరిగింది.

ఇప్పుడు తాజాగా మరోసారి మార్కెట్ విలువ పెంపు ప్రతిపాదన ఎలా ఉండబోతుందో ఆయా సబ్ రిజిస్ట్రార్‌లు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. శనివారపుపేట పరిసర ప్రాంతాల్లో ఇంతకుముందు మార్కెట్ విలువ గజం రూ.ఏడు వేల వరకు ఉండగా ఇప్పుడు దానిని భారీగా పెంచే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు రూ.ఏడు వేల నుంచి రూ.తొమ్మిది వేల వరకు పెరిగినా ఆశ్చర్యపడక్కర్లేదు. ఏలూరు శివారు ప్రాంతాలన్నింటిలోనూ 10 నుంచి 15 శాతం మేర మార్కెట్ విలువ పెరిగే అవకాశాలు స్పష్టంగానే ఉన్నాయి. దీనికి లోబడే అన్ని ప్రాంతాల్లోను మార్కెట్ విలువ పెరగబోతుంది. ఈ తరహా ప్రతిపాదన చేసినప్పుడు ప్రస్తుత మార్కెట్ డిమాండ్, వాణిజ్యపరమైన భూములు, వ్యవసాయ భూముల మార్కెట్ విలువ కొన్ని చోట్ల 15 నుంచి 20 శాతం పెరిగినా ఆశ్చర్యపడక్కర్లేదు. ప్రత్యేకించి వట్లూరు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఇంతకు ముందు రూరల్ ప్రాంతం అత్యధికంగా ఉండేది. కాని గత ఏడాది దాదాపు ఏడు గ్రామాలను ఏలూరు కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఇప్పుడు అవన్నీ ఇప్పుడు నగర పరిధిలోకి వచ్చాయి కాబట్టి ఆ మేరకే మార్కెట్ విలువ ఉంటుంది. అదే నగరంలో అయితే వ్యాపార వాణిజ్య ప్రాంతాల్లో భూమి విలువ మరింత పెరిగింది. ఏలూరులోని ఆర్‌ఆర్‌పేట వాణిజ్య ప్రాంత పరిధిలో గజం రూ.లక్షా 40 నుంచి రూ.లక్షా 60 వేలు పలికింది. ఈ ధర బయట లావాదేవీలకే పరి మితం. కాని ప్రభుత్వ మార్కెట్ విలువ వేలల్లోనే ఉంటుంది. నూజివీడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లోని మార్కెట్ విలువ మరింత పెంచబోతున్నారు. దాదాపు అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో పెరిగే మార్కెట్ విలువ 15 నుంచి 20 శాతం మేర ఉంటుందని అంచనాకు వస్తున్నారు. కాని అధికారులు తమ కార్యాలయాల పరిధిలో గతంలో పెంచిన మార్కెట్ విలువ ఇప్పుడు ప్రభుత్వ సూచనల మేరకు విలువ పెంచబోతున్నారు.

నేడు వెబ్‌సైట్‌లో విలువ పెంపు ప్రతిపాదన



జిల్లా పరిధిలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్కెట్ విలువ పెంపుదల ప్రతిపాదనలపై జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి గురువారం సమీక్షించారు. ఆయా సబ్ రిజిస్ట్రార్‌లు తమ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువను పెంచి సరికొత్త ప్రతిపాదనలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటినీ శుక్రవారం వెబ్‌సైట్‌లో ఉంచుతారు. సమాంతరంగా జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నోటీసు బోర్డుల్లోను ప్రదర్శిస్తారు. విలువ పెంపుపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే ఈనెల 24వ తేదీలోపు లిఖిత పూర్వకంగా సబ్ రిజిస్ట్రార్ లేదా రిజిస్ట్రార్‌కు అందచేయాల్సి ఉంది. ఈ అభ్యంతరాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని ఈనెల 27న తుది ప్రతిపాదనలను ఆమోదించబోతుంది. జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, మరో ముగ్గురు సభ్యులతో కమిటీ ఉంది. ఈ కమిటీదే మార్కెట్ విలువ పెంపు తుది ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉంటుంది.

ధాన్యం కొనుగోలుకు గోనె సంచుల కొరత లేదు : జేసీ

ఏలూరుసిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట ధాన్యం కొనుగోలుకు గోనెసంచుల కొరత లేదని జేసీ ధాత్రిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్క రైతు అవసరార్థం రైతు సేవా కేంద్రాల్లో, ఎంసీఎఫ్‌సీ గోదాముల్లో 42 లక్షల గోనెసంచులను అందుబాటులో ఉంచా మన్నారు. చినిగిన గోనె సంచులు రైతులకు ఇస్తే సంబంధిత రైస్‌మిల్లు/ రైతు సేవాకేంద్రం సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు జిల్లాలో 3.4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు గాను 85 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటి వరకు 78.28 లక్షల గోనెసంచులను ముందస్తుగా పంపిణీ చేశామన్నారు. ఇప్పటివరకు 64,61,500 గోనె సంచులను 2,61,300.840 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుకు వినియోగించగా ఇంకా 13,66,910 గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఈవీఎం గొడౌన్ వద్ద నిరంతర పటిష్ట భద్రత : కలెక్టర్

ఏలూరుసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గొడౌన్ వద్ద నిరంతర పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గొడౌన్‌ను గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. గొడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఎస్.భరత్‌రావు (బీఎస్పీ), అచ్యుత్ (టీడీపీ), నెరసు నెలరాజు (బీజేపీ) , కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు లేనట్టే?

పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం మరో ఆరు నెలల పొడిగింపు



ఏలూరు సిటీ, డిసెంబరు 19 : సహకార సంఘాలకు ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా అని కూటమి కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకపోతే గత ప్రభుత్వ మాదిరిగా సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తారనే ప్రచారం జరిగింది. ఆ ప్రచారాలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత జూలైలో సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులను నియమించింది. వారి ఆరునెలల పదవీకాలం పూర్తవుతుండడంతో తిరిగి పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 159 సహకార సంఘాలున్నాయి. వీటిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, విశాల సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఏలూరులో డీసీసీబీ, డీసీఎంఎస్ ఉన్నాయి.

కుంటుపడుతున్న పాలన

సహకార సంఘాలకు పాలక వర్గాలు లేకపోవడంతో పాలన కుంటుపడుతోందనే విమర్శలున్నాయి. సకాలంలో పంట రుణాలు అందే పరిస్థితులు లేక రైతులు పంటల సాగు కోసం ప్రైవేటు అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులకు సమయం కేటాయించడం వీలు కావడం లేదు. సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఆయా సహకార సంఘాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం కష్టంగా తయారైంది. రెండు నుంచి మూడు సం ఘాలకు ఒకరే పర్సన్ ఇన్‌చార్జిగా ఉండడంతో పాలన సక్రమంగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కూటమి నాయకుల్లో నిరుత్సాహం

సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగించడంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేనట్లేనా అన్న ప్రశ్న వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించడం ఆలస్యమైతే గత ప్రభుత్వంలో మాదిరిగా త్రిసభ్య కమిటీలను నియమిస్తారని, తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని పలువురు కూటమి నాయకులు ఆశించారు. దీనికి సంబంధించి ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఈ సమయంలో సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూటమి నాయకులలో కొంత నిరుత్సాహం కలిగించింది.

ఉమ్మడి జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయులకు
నేడు పదోన్నతి కౌన్సెలింగ్
సబ్జెక్టులవారీ రోస్టర్ పాయింట్లపై అభ్యంతరాలు
ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు
ద్వారకాతిరుమలలో దుకాణదారులకు నోటీసులు
అశ్లీల నృత్యాల కేసులో నిందితుల అరెస్టు
7

అన్నదాత కలవరం


ఏలూరు రూరల్ మండలం మల్కాపురం వద్ద బరకాలు కప్పిన ధాన్యం రాశులు

- అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలు
- పెరిగిన చలిగాలుల తీవ్రత
- జిల్లాలో 78.2 శాతం వరి కోతలు పూర్తి

ఏలూరుసిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారడంతో కోస్తా ప్రాంతంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తగ్గట్టుగానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి మబ్బుల వాతావరణం కొనసాగినా పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. కోసిన వరి పంటను రహదారులపై ఆరబెట్టుకున్న రైతులు వాటిని కుప్పలుగా వేసుకుని దానిపై బరకాలు కప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 1,91,378 ఎకరాల్లో సార్వా సాగు చేయగా ఇప్పటివరకు 1,49,794 ఎకరాల్లో (78.2 శాతం) వరి కోతలు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారుల నివేదికలు చెబుతున్నాయి. అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో చలి గాలుల తీవ్రత పెరిగింది. గంటకు 20 కిలోమీటర్ల వేగంతో చలిగాలులు వీస్తుండటంతో చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. గడిచిన 24గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి 2.1 మి.మీ వర్షపాతం నమోదైంది. వేలేరుపాడులో 9.6, లింగపాలెం 9.4, జంగారెడ్డిగూడెం 5.8, జీలుగుమిల్లి 4, చాట్రాయి 3.8, చింతలపూడి 2.6, బుట్టాయిగూడెం 2.4, కామవరపుకోట 2 మి.మీ వర్ష పాతం నమోదైంది.


ముదినేపల్లి మండలం ఊటుకూరులో నేలకొరిగిన వరిపంటను కోస్తున్న కూలీలు

ఉరుకులు..పరుగులు

ఏలూరు రూరల్/లింగపాలెం/ముదినేపల్లి/జీలుగుమిల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాల కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉండగా గురువారం సాయంత్రం కొద్దిపాటి జల్లులు పడ్డాయి. దీంతో వరికోతలు కోసి కుప్పవేయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో వరికోతలు ప్రారంభ దశలో ఉండటంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. 16 వేల హెక్టార్‌లలో వరిపంట సాగవుతోంది. కేవలం 30శాతం మాత్రమే కోతలు పూర్తి అయ్యాయి. నూర్పిళ్ళు చేసిన వరిపంటను ట్రాక్టర్లు, ఎడ్లబళ్ళపై ఇళ్లకు తరలిస్తున్నారు. లింగపాలెం మండలంలో అకాల వర్షాలు కురవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు రోజులుగా ఒక మాదిరి వర్షం కురుస్తుండటంతో తాము కష్టపడి పండించిన వరిధాన్యం తడవకుండా పరదాలు కప్పి ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు.

భారీగా పెరిగిన వరి కోత ఖర్చు

సార్వా వరి కోత ఖర్చు భారీగా పెరిగింది. తుఫానుల ఫలితంగా వీచిన ఈదురుగాలులు, వర్షాలకు నేలకొరిగిన వరి పైరును కోసేందుకు యంత్రాల వినియోగానికైనా, కూలీలకైనా ఎక్కువ రేట్లు చెల్లించాల్సి వస్తోంది. ముదినేపల్లి ప్రాంతంలో వేలాది ఎకరాల్లో వరిపైరు నెలరోజుల క్రితమే నేలకొరిగింది. సాధారణంగా నిలువుగా ఉన్న వరి పైరును కోసేందుకు వరి కోత యంత్రానికి ఎకరానికి గంటన్నర సమయం పట్టేది. కోత ఖర్చు సుమారు రూ.6 వేలు అయ్యేది. ఇప్పుడు సుమారు 4 గంటల సమయం పడుతుండగా, రూ.13 వేలు ఖర్చు అవుతోంది. ఇక కూలీలతో ఎకరం నిలువు మీద ఉన్న వరి పైరు కోసి కుప్పలు నూర్చి ధాన్యం రాసి చేసే వరకు రూ.12 వేలు ఖర్చు అయ్యేది. ఇప్పుడు నేలకొరిగిన వరి పైరును కోసి, కుప్పలు నూర్చాలంటే కనీసం రూ.20 వేలు అవుతోంది. ఎకరానికి పెట్టుబడి రూ.40 వేలు నుంచి రూ.45 వేలు అవుతుండగా తుఫానుల వల్ల అదనంగా రూ.15 వేల నుంచి రూ.20 వేల పెట్టుబడి పెరిగింది.

వేరుశనగ రైతుల్లో ఆందోళన

రెండు రోజులుగా చెదురు మదురు జల్లులు పడుతుండడంతో జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు తదితర గ్రామాల్లో వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు కంటి మీద కునుకు లేకుండా పంటను కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్ని అదునుగా చేసుకుని వ్యాపారులు క్వింటా రూ.6,300 నుంచి రూ.6,800 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, గతేడాది రూ. తొమ్మిది వేల వరకు కొనుగోలు చేశారని వాపోతున్నారు.


జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో వేరుశనగ పంటను పోగు చేసి మిల్లర్‌లో వేస్తున్న కూలీలు

సత్యసాయి కార్మికుల జీతం బకాయిలకు లైన్ క్లియర్


ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకి వినతిపత్రం ఇస్తున్న సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి మంచినీటి కార్మికుల జీతం బకాయిలకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. 'జీతాల బకాయిలు ఇప్పించండి మహాప్రభో' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించారు. తొమ్మిది నెలలుగా జీతాలు లేక సత్యసాయి కార్మికులు పడుతున్న అవస్థలు తెలుసుకుని కార్మికులను పిలిపించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి తమ సమస్యలపై కార్మికులు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు ఏలూరులో కలెక్టర్, జడ్పీ సీఈవో కార్యాలయాలకు వెళ్లి మాట్లాడి సమస్య పరిష్కార దిశగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలుత సత్యసాయి కార్మికులకు మూడు నెలల జీతం బకాయిలు చెల్లించేలా మిగతా బకాయిలు పండుగ తర్వాత చెల్లించే విధంగా కలెక్టర్, జడ్పీ సీఈవో హామీ ఇచ్చారన్నారు. సత్యసాయి మంచినీటి సరఫరా స్కీం కాంట్రాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఫైనాన్స్ సెక్రటరీ సత్యసాయి మంచినీటి పంపిణీ కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు రూ. 8 కోట్లు నిధులు ఇవ్వడానికి అంగీకరించినట్టు తెలిపారు. ప్రస్తుతం సత్యసాయి వర్కర్స్ జీతం బకాయిల సమస్య పరిష్కారానికి జడ్పీ నిధుల నుంచి తమకు రూ.కోటి మంజూరు చేస్తున్నారని, నిధులు మంజూరై బిల్లుల చెల్లింపు అనంతరం జడ్పీ నిధులు రీయింబర్స్ చేసేలా ఒప్పందమైనట్టు తెలిపారు. కోటి రూపాయలు తమ ఖాతాకు జమ కాగానే జీతం బకాయిలు చెల్లిస్తామన్నారు.


భీమవరం లూథరన్ చర్చి




ఏలూరు సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చి






క్రిస్మస్ కాంతులు

ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది.. వస్త్రదుకాణాలు కళకళలాడుతున్నాయి.. ఇళ్లపై క్రిస్మస్ స్టార్‌లు మెరుస్తున్నాయి. చర్చిలు విద్యుద్దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి.. షాపుల్లో రకరకాల క్రిస్మస్ కానుకులు, స్టార్‌లు, లైటింగ్ ఉపకరణాలు కొలువుదీరాయి.. ఏలూరు, భీమవరంలో కనువిందు చేస్తున్న దృశ్యాలివీ..






భీమవరం రూపాంతర దేవాలయం






ఏలూరు మన్నా చర్చి





దీక్షధారులకు మాలను ధరింపచేస్తున్న అర్చకస్వామి.. మాలధారణలో గోవిందస్వాములు

అర్ధమండల దీక్ష చేపట్టిన శ్రీవారి భక్తులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గోవిందా.. గోవిందా అంటూ గోవిందు నిపై భక్తి విశ్వాసాలతో వారంతా నుదుటన తిరునామాలు దిద్ది, పసుపు వస్త్రాలను దరించి గురువారం తెల్లవారుజామున గోవిందమాలను ధరించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినానికి 21 రోజుల ముందు వీరంతా అర్ధమండల దీక్షను చేపట్టారు. వచ్చేనెల 10న ముక్కోటినాడు వీరంతా స్వామికి ఇరుముడులు సమర్పించి దీక్షా విరమణ చేయనున్నారు. ద్వారకాతిరుమల, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 30 మంది వరకూ ఈ దీక్షను చేపట్టారు. దీక్షాధారణ అనంతరం గోవింద స్వాములు దీపారాధన చేసి స్వామి ఆలయంలో భజనలు చేశారు.తరువాత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దీక్షాధారులకు దేవస్థానం ప్రతి నిత్యం శ్రీవారి ఉచిత దర్శనంతో పాటు, మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పిస్తోంది.

గజ,అశ్వ సేవలతో పుర వీధులకు శ్రీవారు

ద్వారకాతిరుమల, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గజ, అశ్వసేవల నడుమ చినవెంకన్న, ఉభయదేవేరులతో గోదాదేవి సమేతంగా క్షేత్ర పురవీధుల్లో గురువారం ఉదయం ఊరేగారు. ఈ ధనుర్మాస ఉత్సవం చూపరులకు నేత్ర పర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను గోదాదేవి సమేతంగా తొళక్కువాహనంపై ఉంచి అర్చకులు పూజాధికాలు జరిపారు. హారతులు సమర్పించారు. అనంతరం అట్టహాసంగా క్షేత్ర పురవీధుల్లో ఊరేగించి ధనుర్మాస మండపంలో పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



మద్ది ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.45.64 లక్షలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం ఈవో ఆర్.వి చందన ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. 51 రోజులకు గాను దేవస్థాన హుండీల ద్వారా రూ.43,77,549, అన్నదానం హుండీద్వారా రూ.1, 87,021 మొత్తం రూ.45,64,570 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు సీహెచ్ ఉదయ్ కుమార్ బాబు, లక్కవరం ఏఎస్సై బాస్కర్, కరూర్ వైశ్యాబ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





ఆకర్షిస్తోన్న పట్టిసీమ పథకం నమూనా

పోలవరం డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం అనేక ముఖ్యమైన విశేషాలను సంతరించుకుంది. ఈ పథకంలో నీటిని ఎత్తిపోతల పద్ధతిలో పైకి పంపి డెలివరీ ఛానల్ ద్వారా ప్రకాశం బ్యారేజి వరకూ తరలించే వ్యవస్థను అద్భుతంగా చూపేందుకు రూపొందించిన ఎత్తిపోతల పథకం మోడల్ హౌస్ ఇక్కడకు వచ్చే సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. పట్టిసీమ పథకం నిర్మాణం, నీటి ప్రవాహ వ్యవస్థను, ఆధునిక ఇంజనీరింగ్ పద్ధతులను సమగ్రంగా చూపిస్తున్నది. నీటి నమూనా ధారల రూపంలో ప్రవహించడాన్ని పథకం ఎలా పని చేస్తుందో చూపడానికి ఈ మోడల్ ద్వారా అక్కడి ఇంజనీరింగ్ అధికారులు సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం పర్యాటకులు, విద్యార్థులు ఈ మోడల్ హౌస్‌ని సందర్శిస్తున్నారు.

ఈ పథకం ద్వారా నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించు కోవడమే కాకుండా నదుల అనుసంధానం రాష్ట్ర అభివృద్ధికి ఎలా దోహదపడుతుందన్న దృశ్యాన్ని మోడల్ స్పష్టంగా చూపుతుంది. అంతేకాదు పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ వెళ్లే మార్గంలో కాలువకు అడ్డంగా వచ్చే రామిలేరు, గుండేరు, తమ్మిలేరు, ఎర్రకాలువలను కుడికాలువలో కలవనీయకుండా కాలువపై నుంచి తరలించే ఇంజ నీరింగ్ టెక్నాలజీని కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తున్నది. పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి ఈ మోడల్ ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు తల్లి పాల బ్యాంకు ప్రారంభం

భీమవరంక్రైం, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల బ్యాంకును 20వ తేదీ గురువారం ప్రారంభించనున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సుశేణా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ, ఇతర ముఖ్య భాగస్వాముల సహకారంతో తల్లిపాల బ్యాంకును ఆసుపత్రి నందు ఏర్పాటు చేస్తున్నారు. ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణిని కలిసి సుశేణా హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధి స్టేట్ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యనారాయణ అందజేశారు. తల్లులకు సమగ్ర లాక్టేషన్ మద్దతు అందించడానికి, శిశువులకు అత్యుత్తమ పోషణ నిర్ధారించడానికి దీన్ని ఏర్పాటు చేసినట్టు ప్రతినిధులు తెలిపారు.


గరగపర్రు రోడ్డులో పెండింగ్ చలానాలు కట్టాలని వాహనదారులకు సూచిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెండింగ్ చలానాలు చెల్లించండి

భీమవరం క్రైం, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినా, హెల్మెట్ లేకపోయినా, సరైన పత్రాలు లేకపోయినా వాహనదారులకు పోలీసులు జరిమానాలు విధిస్తారు. ఉన్నతాధికారులు గతంలో వాహనదారులకు విధించిన జరిమానాలు వాహనాల యజమానులతో కట్టించాలని ఆదేశాలు రావడంతో పోలీసులు తంటాలు పడుతున్నారు. వాహనాలను ఆపి ఆ నంబర్ ప్రకారం పెండింగ్ చలానా ఎంత ఉందో చూసి వాహనదారులతో కట్టిస్తున్నారు. వారం రోజులుగా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఇదే పనిలో ఉన్నారు. హైకోర్టు ఆదేశాలతో పెండింగ్ చలానాలు కట్టిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జిల్లా మొత్తం మీద కోటీ 20 లక్షల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉన్నాయని సమాచారం.



ఓవరాల్ ఛాంపియన్ ఏలూరు సీఆర్ఆర్

ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా సాగుతున్న క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 11 కళాశాలకు చెందిన 473 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఓవరాల్ ఛాంపియన్‌గా ఏలూరు సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ విదార్థులు నిలిచాచారు. వ్యక్తిగత పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు తమ అభిప్రాయాలు ఆంధ్ర జ్యోతితో పంచుకున్నారు.

ఐదు పతకాలు సాధించాను



మా కళాశాల తరపున వ్యక్తిగత విభాగంలో పతకాలు సాధించాను. మా స్నేహితులు కూడా ఈ పోటీల్లో మంచి ఫలితాలు సాధించారు. ఈ పోటీ నాకు ఎంతో ప్రత్యేకం. 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో ఫస్ట్ ప్లేస్, లాంగ్ జంప్, రిలేలో రెండో స్థానం, హైజంప్‌లో మూడో స్థానంలో నిలిచి ఐదు పతకాలు సాధించాను.

-డి.భాగ్యలక్ష్మి, సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్, ఏలూరు

ఈ పోటీలు నాకు ప్రత్యేకం



వ్యక్తిగత విభాగంలో పాల్గొన్న ప్రతీ ఈవెంట్‌లోనూ రాణించాలని భావించాను.అదే విధంగా ఈ పోటీ నాకు ఎంతో స్పెషల్. నేను ఈ పోటీల్లో 4'100 రిలేలో ఫస్ట్ ప్లేస్‌లో, 100మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచాను.ఎంతో ఆనందంగా ఉంది.

-ఎ.గౌతమి, సీతాపాలిటెక్నిక్, భీమవరం

ఆరు పతకాలు సాధించాను



స్కూల్ దశ నుంచి నాకు ఈవెంట్స్‌పై మక్కువ. ఈ పోటీలు నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. పాల్గొన్న ప్రతీ ఈవెంట్‌లోనూ మొదటిస్థానంలో నిలవడం ఎంతో ఆనందం. 100 మీటర్లు, 200 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌లలో మొదటి స్థానంలో నిలిచాను. 4'100లా రెండో స్థానంలో నిలిచి ఆరు పతకాలు సాధించడం ఆనందం ఇచ్చింది.

- వీవీ అవినాష్, తణుకు పాలిటెక్నిక్ కళాశాల

దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్

అత్తిలి,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్,డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్లీ ఏబుల్డ్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నూతన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటితో ముగియనుందని కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఏసీఏ గౌరవ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు శుక్రవారం లోపుగా తమపేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న దివ్యాంగ క్రీడా కారుల ఎంపిక తేదీని శనివారం ప్రకటి స్తామని తెలిపారు. క్రికెట్ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా దివ్యాంగ క్రీడా కారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం కన్వీనర్ దాసం దుర్గారావు సెల్ ఫోన్ నంబర్ 90141 44440లో సంప్రదించాలన్నారు.


విద్యార్థుల్ని అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

ఐఈటీ ఈవెంట్‌లో స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ

నరసాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి):స్వర్ణాంధ్ర కళాశాలకు చెందిన సీఎస్‌ఈ మూడో ఏడాది చదువుతున్న ఎస్.భార్గవి, ఈషిత, శ్రీరామ్‌రెడ్డిలు ఐఈటీ ఈవెంట్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో మూడు రాష్ట్రాలకు చెందిన 40 టీమ్‌లు పాల్గొనగా స్వర్ణాంధ్ర విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు.

రేపు తణుకులో వేమన పద్య దశ సహస్ర గళార్చన

తణుకు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తణుకు బాలురున్నత పాఠశాలలో ఈనెల 21వ తేదీన వేమన శతక పద్య దశ సహస్ర గళార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెరవలి మాతృభాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆప్కాస్మో సహకారంతో 108 పాఠశాలల నుంచి 10 వేల మంది చిన్నారులతో 108 వేమన శతక పద్యాలు రాగయుక్తంగా ఆలపించే మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

జీలుగుమిల్లి-పట్టిసీమకు జాతీయ రహదారి

సీఎం చంద్రదబాబు ఆదేశంతో కదలిక

భూసేకరణ కోసం సమీక్షించిన కలెక్టర్ పి. ప్రశాంతి

పట్టిసీమ నుంచి కొవ్వూరు వరకు ఏటిగట్టు వెంబడి కూడా జాతీయ రహదారి

రాజమహేంద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అనుకూలంగా జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకూ, అక్కడ నుంచి ఏటిగట్టు ఎంబడి జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈప్రతిపాదన సుమారు ఏడేళ్ల క్రితమే ఉన్నప్పటికీ, ఇటీవల పోలవరం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశంతో మళ్ళీ కదిలింది. జీలుగుమిల్లి, బుట్టాయ గూడెం, కన్నాపురం, కెఆర్‌పురం, దొండపూడి మీదగా పట్టిసీమ వరకూ ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. జీలుగుమిల్లి నుంచి కొంతమేర ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇక పట్టిసీమ నుంచి ఏటిగట్టును విస్తరించుకుంటూ కొవ్వూరు టౌన్ వరకూ కూడా జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి గురువారం రాత్రి అధికార్లతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా జాతీయ రహదారి నిర్మాణం మీద దిశా నిర్దేశం చేశారన్నారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తున్న జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణ పై సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని ఆయన ఆదేశించారు. పట్టిసీమ నుంచి పోలవరం ప్రాజెక్టుకు రహదారి కలపడం, పట్టిసీమ నుంచి కొవ్వూరు వరకూ జాతీయ రహదారి నిర్మాణం మీద కూడా సమీక్షించారు. ఇరిగేషన్, ఎన్‌హెచ్. ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికార్లతో కూడిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని ఆమె ఆదేశించారు. ఈనెల 23, 26వ తేదీలలో ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఈ విషయం గురించి కలెక్టర్ ప్రశాంతి విజయవాడ ఎన్‌హెచ్ అధికార్లతో మాట్లాడారు. వచ్చేసమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు. భూసేకరణ నిధులు కేటాయింపు విషయంలో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ముందు విమానాశ్రయ భూసేకరణలో మ్యుటేషన్ డ్రైనేజీ, విద్యుత్ సంస్థల ద్వారా ప్రతిపాదిత పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. విమానాశ్రయ భూసేకరణ బాగానే సాగుతున్నట్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. జాతీయ రహదారి మార్గంలో సుందరీకరణ పనులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఎస్‌పితో కలసి పరిశీలించినపుడు గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారితో హేబిటేషన్లు అనుసంధానమవుతున్న ప్రాంతాలలో ఇంతవరకూ ఎటువంటి లైటింగ్ ఏర్పాటు చేయక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిడదవోలు ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పిల్లర్స్ ఏర్పాటు, ఇతర పనులు సమాంతరంగా జరగాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో సీతారామ మూర్తి, ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎన్‌హెచ్ పీడీ సురేంద్రబాబు, రైల్వే ఈఈ కె.అశోక్‌కుమార్, రైల్వే ఎస్‌ఎస్ ఈజీ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఎస్‌బివి రెడ్డి, కొవ్వూరుఈఈ రూప్‌కుమార్ పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ ఎలా..?


అత్తిలి అంగన్‌వాడీ వద్ద కిచెన్ గార్డెన్

- 5 సెంట్ల భూమిలో కూరగాయలు పెంచాలి
- అంగన్‌వాడీలకు భారం
- నీరు, నిర్వహణ కష్టం

అత్తిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి ఆహారం అందించాలనే లక్ష్యంతో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు నిర్ణయించారు. వీటి నిర్వహణ బాధ్యత అంగన్‌వాడీ వర్కర్లకు అప్పగించడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్రాల నిర్వహణ సమయంలో కిచెన్ గార్డెన్ ఎలా సాధ్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్‌గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని ఒక్కొక్క కార్యకర్తకు రూ. 10 వేలు చొప్పున జమ చేశారు.

చాలా చోట్ల స్థలం కొరత

జిల్లాలో 1556 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 70 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 592 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా 627 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 407 ఉచిత భవనా ల్లో నిర్వహిస్తున్నారు. సక్షం కింద కిచెన్ గార్డెన్లకు జిల్లాలో 500 పైగా కేంద్రాలను ఎంపిక చేశారు. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా సరైన స్థలం లేదు. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలలో ఇక చెప్పనక్కర్లేదు. చిన్నారులు ఆడుకోవడానికి స్థలం లేని పరిస్థితిలో కిచెన్ గార్డెన్ ఎలా ఏర్పాటు చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణాలులేని చోట్ల స్థానిక నాయకులు పంచాయతీ, అధికారుల సాయంతో 5 సెంట్ల స్థలం తీసుకుని అందులో కూరలు పండించాలని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఒకవేళ స్థలం సిద్ధం చేసి సాగు, నీరు, నిర్వహణ ఎవరు చూస్తారని, పశువులు, మేకలు రాకుండా కట్టడి చేయడం సాధ్యం కాదని ఆందోళన చెందుతున్నారు. కిచెన్ గార్డెన్‌కు నీటి సదుపాయం సమకూర్చుకోవడం కూడా తలకు మించిన భారంగా మారుతుందని అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు.

చేలల్లో మంటలు


పెనుమంత్ర వద్ద భూముల్లో కాలుతున్న వరి దుబ్బులు

- వరి మాసూళ్లు అనంతరం దుబ్బులు కాల్చుతున్న రైతులు
- భూసారానికి ముప్పు
- మిత్ర పురుగులు నశిస్తాయి
- శాస్త్రవేత్తల హెచ్చరిక

పెనుమంత్ర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి మాసూళ్ల అనంతరం చేలల్లో దుబ్బులను రైతులు తగలబెడుతున్నారు. కూలీలు కొరతను అధిగమించేందుకు ఖర్చులు తగ్గించుకోవడానికి యంత్రాలతో వరి కోత చేస్తున్నారు. యంత్రాలు నేలమట్టానికి దుబ్బులు కోయడం లేదు. కోసిన గడ్డి పశువులకు పూర్తిగా ఉపయోగించుకునే పరిస్థితి లేదు. గడ్డి కట్టలు కట్టే యంత్రాలు అందుబాటులో లేవు. దీనితో చేలో గడ్డి ఎక్కువగా ఉంటే తగలబెట్టేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దుబ్బును తగలబెట్టడం వల్ల లాభదాయక సేంద్రియ ఎరువులు కాలి బూడిద కావడంతో పంటకు నష్టం వాటిల్లుతుందని భూసారం కోల్పోతుందని నిపుణులు చెబుతున్నారు.

దుష్పరిణామాలు తప్పవు

వరి దుబ్బు కాల్చితే దుష్పరిణామాలు తప్పవని భూసార శాస్త్రవేత్త సీహెచ్.శ్రీనివాస్ రైతులను హెచ్చరిస్తున్నారు. చేలోనే గడ్డిని తగల బెట్టడం వల్ల 149.24 మిలియన్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్, 9 మిలియన్ టన్నుల కార్బన్ మోనాక్సైడ్, 25 మిలియన్ల టన్నుల సల్ఫర్ ఆక్సైడ్, 1.28 టన్నుల బూడిద నుసి విడుదలతో వాతావరణ కలుషితం అవుతుందన్నారు. చేలలో గడ్డిని మండించడం వల్ల సుమారు ఒక సెంటీమీటర్ లోతులో ఉన్న పంటకు మేలు చేసే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనితో భూమి నిస్సారం అవుతుందన్నారు. వేడి వల్ల మిత్ర కీటకాలు మిత్ర శిలీంద్రాలు నశించడం వల్ల చీడ పీడల ఉధృతి పెరిగి పోతుందన్నారు.

ఒక టన్ను గడ్డి తగలబెడితే..

శాస్త్రవేత్తల పరిశోధనలో ఒక టన్ను గడ్డిని తగలబెడితే ఉత్పన్నమయ్యే రసాయన ప్రభావాలు వెలుగు చూశాయి. 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల పాస్పరస్, 2.8 కిలోల పొటాషియం ఒక కిలో సల్ఫర్, సేంద్రియ కర్బనాన్ని నేల కోల్పోతుందని తెలిపారు. టన్ను వరి గడ్డిలో 5 నుంచి 8 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 17 కిలోల పొటాషియం, కిలో గంధకం, 3 నుంచి 4 కిలోల కాల్షియం, 1 నుంచి 3 కిలోల మెగ్నీషియం, 40 కిలోల సిలికాన్ ఉంటాయి.

వరిగడ్డి తగలబెట్టడం వల్ల మనుషులపై దుష్ప్రభావం ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. పొగ వల్ల కళ్ల మంటలు, ముక్కులో మంట, గొంతు నొప్పి సంభవిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలకు కూడా దారితీస్తాయి.

పెనుగొండ వాసవీ ధామ్‌కు రండి

జనవరిలో వాసవీ మాత ఆత్మార్పణ దినం.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం


సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు గోవిందరాజులు, మంత్రి టీజీ భరత్

పెనుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాసవి మాత ఆత్మార్పణ పర్వదినం జనవరి 30న జరగనుంది. వాసవి శాంతిధామ్‌లో జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా రావాలని అఖిల భారత శ్రీ వాసవి పెనుగొండ టెంపుల్ ట్రస్టు అధ్యక్షుడు పీఎస్ గోవిందరాజులు ఆహ్వానించారు. అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువా రం ఆహ్వానం అందజేశామని శాంతిధామ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. గోవిందరాజులు వెంట ప్రధాన కార్యదర్శి కెఆర్ కృష్ణ, కార్యదర్శి కెఎస్‌వీ రాజా, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టీజీ భరత్ ఉన్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయులకు

నేడు పదోన్నతి కౌన్సెలింగ్

సబ్జెక్టులవారీ రోస్టర్ పాయింట్లపై అభ్యంతరాలు


శ్రీకాకుళం ఉపాధ్యాయుడి మృతికి నివాళులర్పించి డీఈవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో డీఈవో వెంకటలక్ష్మమ్మ గురువారం సమావేశం నిర్వహించారు. ఏలూరు నగర పాలకసంస్థ, మరో ఏడు పురపాలక సంఘాల పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీ చేయాల్సి ఉంది. సబ్జెక్టుల వారీగా రోస్టర్ ప్రకారం ఇంతకుముందు పదోన్నతుల వివరాలపై విద్యాశాఖ సమాచారం ఇవ్వకుండా హడావుడిగా కౌన్సెలింగ్ ఏర్పాట్లు చేయడాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ (పీహెచ్) ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని డీఈవో దృష్టికి తీసుకెళ్ళారు. సంబంధిత రోస్టర్‌ను సబ్జెక్టులవారీగా పురపాలక శాఖ అందజేసిన వివరాల ప్రకారమే శుక్రవారం పదోన్నతులు ఇవ్వగలమని విద్యాశాఖవర్గాలు స్పష్టం చేసినప్పటికీ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు అంగీకరించలేదు. సమగ్ర వివరాలను మరోదఫా పురపాలక సంఘాల వారీగా తెప్పించుకున్న తర్వాతే పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టాలని, అప్పటివరకు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఎస్‌ఏ-1 పరీక్షల్లోభాగంగా గురువారం సోషల్ స్టడీస్ పరీక్షకు ప్రశ్నపత్రాలను తీసుకువచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుడు సిద్ధయ్యశెట్టి మృతికి నివాళులర్పిస్తూ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే పాఠశాల లకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ జేఏసీ నాయకు లు షేక్ ముస్తఫాఅలీ, రాజ్‌కుమార్, సుబ్బారావు, రాంబాబు, రాజారావు, ఆదినారాయణ, పర్వీన్‌బేగం, వెంకటరమణ, ప్రసాద్, రామారావు, రెడ్డిదొర తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు ఇలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో రెండు గ్రేడ్-2 ప్రధానో పాధ్యాయుల ఖాళీలు, 9 స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్ వేకెన్సీలను ప్రమోషన్‌పై నింపాల్సి ఉంది. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఇంగ్లీషు, గణితం, బయోలాజికల్ సైన్స్ ఒకొక్కటి చొప్పున, సోషల్ స్టడీస్ 2, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 3 వెకెన్సీలను పదోన్నతిపై భర్తీచేయనుండగా, ఒక ఫిజికల్ డైరెక్టర్ ఖాళీకి అర్హులు లేకపోవడంతో అలానే ఉంచేస్తున్నారు. ఏడు మున్సిపాల్టీల్లో గ్రేడ్-2 హెచ్‌ఎం వేకెన్సీలు 5, స్కూల్ అసిస్టెంట్ కేడర్ వేకెన్సీలు 34 ఉన్నాయి. వీటిలో సోషల్ స్టడీస్ 8, గణితం, బయోలాజికల్ సైన్స్ ఐదేసి చొప్పున, ఇంగ్లీషు 3, ఫిజికల్ సైన్స్ 4, సంస్కృతం ఒకటి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 4 వెకెన్సీలను పదోన్నతిపై భర్తీచేయనుండగా, మరో నాలుగు వ్యాయామవిద్య ఉపాధ్యాయుల(పీడీ) వేకెన్సీలకు అర్హులు లేకపోవడంతో నిలిపివేయనున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతులకు కాకినాడ ఆర్జేడీ నుంచి గురువారం రాత్రి వరకు అప్రూవల్ రాలేదు. అనుమతివస్తేనే శుక్రవారం పదోన్నతుల కౌన్సెలింగ్‌లో చేరుస్తారు.

జాబితా ప్రకారమే పదోన్నతులు

రోస్టర్‌పై ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన అభ్యంతరాలను జిల్లా విద్యాశాఖ కొట్టివేసింది. పురపాలకశాఖ రీజినల్ డైరెక్టర్ సంతకంపెట్టి ఇచ్చిన జాబితా ప్రకారమే సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితాలను విడుదల చేశామని, వాటిలో అభ్యంతరాలుంటే కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తామని అధికార వర్గాలు తేల్చి చెప్పాయి. నిబంధనల మేరకే పారదర్శకంగా ప్రమోషన్లు ఇస్తున్నామని వివరించాయి.



భీమవరంలో ప్లాస్టిక్ వాడకం నియంత్రణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ద్వారకాతిరుమలలో దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

ద్వారకాతిరుమలలో దుకాణదారులకు నోటీసులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రం వద్ద పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. పారిశుధ్యం మెరుగుపరిచే దిశగా ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయాలు నిలిపి వేయాలని సూచించారు. వాటి వల్ల నష్టాలను దుకాణయజమానులకు గ్రామ కార్యదర్శి జీటి శ్రీనివాస్, మహిళా పోలీసు పి.లక్ష్మీసుజన తదితరులు వివరించారు. భూమిలో చేరి పర్యావరణానికి తీరని నష్టం కలుగచేస్తాయన్నారు. చిరు వ్యాపారులు 20 మిల్లీ మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులను వినియోగించవద్దని సూచించారు. చిన్న వెంకన్న పుణ్యక్షేత్రానికి వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, వారి అవసరాలకు మందమైన కవర్లు, వస్తువులు వాడాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లీశ్వరి, నరేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

భీమవరం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులనే వినియోగించాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ జూనియర్ కళాశాలల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ సదస్సు ప్రతిజ్ఞ నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేపట్టి జరిమానాలు హెచ్చరికలు చేశామన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం కనిపిస్తే జరిమానాలు తప్పవన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులు నిరక్షరాస్యులకు తెలియజెప్పాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలన్నారు. చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించి ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ సంచులనే వాడాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విప్పర్తి వెంకటరత్నం, గుత్తుల హేమలత, తాడిపత్రి రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే భవనాల నిర్మాణం ఒక్కటే కాదు

మాజీ ఎంపీ జోగయ్య

పాలకొల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే పరిపాలనా భవనాలు, పార్కుల నిర్మాణం కాదని, వీటికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం, తాగు, సాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు కలగచేయడమే అభివృద్ధి అన్నారు. దీనిపై రాష్ట్రం దృష్టిపెట్టాలని సూచించారు. పాలకొల్లులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందని, 500 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలన్నారు. ఆసుపత్రి భవనానికి కావాల్సిన స్థలం అందుబాటులో ఉందన్నారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు కృషి చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

అశ్లీల నృత్యాల కేసులో నిందితుల అరెస్టు

నిడమర్రు, డిసెంబరు 19: బావాయిపాలెం రైస్‌మిల్లులో అశ్లీల నృత్యాలు చేస్తున్న కేసును పోలీసులు 24 గంటల్లో నిందితులను అరెస్టు చేశారు. సీఐ సుభాష్, ఎస్‌ఐ ఎస్.వీరప్రసాద్ వివరాలు తెలిపారు. బావాయిపాలెం రైస్ మిల్లులో ఈ నెల 15న వాకమూడి ఇంద్రకుమార్ పుట్టినరోజు వేడుకలలో అశ్లీల నృత్యాలు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో 22 మంది స్థానికులు కాగా, ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

మహిళల రవికల చోరీ

వలపన్ని పట్టుకున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆ దొంగ ప్రతి రోజు రాత్రి వేళ్ల ఇళ్లలో చోరీకి పాల్పడతాడు.. తలుపులు పగులగొట్టడు, విలువైన వస్తువులు ముట్టుకోడు. కేవలం మహిళల రవికలనే ఎత్తుకెళతాడు. ఆరు నెలలుగా దాదాపు 300పైగా జాకెట్లను అపహరించాడు. గ్రామస్థులు ఈ దొంగను పట్టుకునేందుకు కాపు కాస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు గురువారం చిక్కాడు. ఈ సంఘటన నరసాపురం మండలం దర్భరేవులో వెలుగు చూసింది. రాత్రి వేళ గోడలు దూకి ఇంటి వెనుక బాత్‌రూమ్‌ల వద్దకు వెళతాడు. స్నానంచేసి మహిళలు విడిచిపెట్టిన జాకెట్లునే ఎత్తుకెళ్లేవాడు. మొదట గ్రామస్థులు పెద్దగా పట్టించుకోలేదు. బయట, ఇంటిలో సామాన్లు ఏమి పోకపోవడంతో దొంగ అని అనుమానించలేకపోయారు. వరసగా పలు ఇళ్లలో ఇదే తరహాలో జాకెట్లు పోతుండడంతో చర్చకు దారితీసింది. కానీ బయటకు చెప్పుకోలేని పరిస్థితి. చివరికి గ్రామంలో ఎలాగైనా ఈదొంగను పట్టుకోవాలని కాపు కాశారు. ఎప్పుడు, ఏ సమయంలో చోరీకి వస్తాడో తెలియకపోవడంతో ఆరు నెలలుగా చిక్కలేదు. చివరికి దర్భరేవులో ఒక ఇంట్లో జాకెట్లు ఎత్తుకెళతుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. చేతిలో ఉన్న సంచిని వెతకగా కొన్ని జాకెట్లు కనిపించాయి. అతడిని నిలదీయడంతో వేములదీవి గ్రామమని వెల్లడించారు. అతడిని తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. విచారించగా తనకున్న బలహీనతను వెల్లడించారు. దొంగలించిన జాకెట్లను పంట కాల్వలో పడేసినట్లు తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టారు.

క్రైమ్ కార్నర్

పొట్టకూటి కోసం వెళ్లి మృత్యువాత

మినప కోత మిషన్‌లో పడి మృతి


కోత మిషన్‌లో చిక్కుకున్న మృతదేహం (ఇన్‌సెట్) యల్లయ్య (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం మినప కోత పనికి వెళ్లిన కూలీ కోత మిషన్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురంలో గురువారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా రాజాంకు చెందిన విష్ణుపాత్రుని యల్లయ్య(37) మినప కోతలకు మిషన్ వద్ద పని చేసేందుకు వచ్చాడు. నీలాద్రిపురం శివారు కృష్ణాపురంలో మినప రొట్ట నూర్చేందుకు రొట్టను మిషన్‌లో వేస్తుండగా మిషన్ వేగంగా గాలి వేయడంతో బరకంతోపాటు క్రషర్‌లోకి దూసుకుపోయాడు. ప్రమాదంలో తల నుంచి మొండెం వేరు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి..

యలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపట్ల గ్రామానికి చెందిన పొన్నాడ ఏసురాజు (35) చేపల వేటకు వెళ్లి గురువారం మృతి చెందినట్టు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఏసురాజు గురువారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లాడు. చేతి వలతో వెళ్లిన ఏసురాజు గోదావరి ఒడ్డున పడి ఉండడాన్ని చూసిన స్థానికులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని చూడగా ఏసురాజు అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న

ముగ్గురి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు గురువారం మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా గురువారం మృతి చెందాడు. కాగా మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదు. పెరవలి మండలం ఖండవల్లి గ్రామం వద్ద నవంబరు 22న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో నరేష్ (55) తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. 108 అంబులెన్సులో తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతుడి వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన బీహార్ వాసి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. లింగపాలెం మంలం రంగాపురంలో పనుల నిమిత్తం వచ్చారు. వారిలో సోనూ కుమార్ (20) మరొకరితో మోటారు సైకిల్‌పై బుధవారం ఏలూరు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో సోనుకుమార్ తీవ్ర గాయాలకు గురికాగా అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనలపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సంతానం కలగలేదని..

వివాహమై ఏడేళ్లైనా సంతానం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం బూరాయిగూడేనికి చెందిన కాటి కిశోర్ (25)కు మౌనికతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. పిల్లలు లేరని మానసిక వ్యథతో కిశోర్ ఈనెల 17న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

అప్పుల భారంతో..

పురుగుమందు తాగి మృతి

టి.నరసాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరభద్రవరం గ్రామానికి చెందిన మామిళ్ళ సూర్య చంద్రరావు (38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం నిమిత్తం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో అప్పు తీర్చలేనని భయంతో ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య నాగలక్ష్మికి చెప్పడంతో వెంటనే అతడిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎం.జయరాజు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వివాహేతర సంబంధం ఉందని..

కోడి కత్తితో దాడి.. హత్యాయత్నం

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో ఒక యువకుడు వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుండడంతో పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికి సంబంధం కొనసాగించడంతో అకస్మాత్తుగా కోడి కత్తి తీసి దాడి చేశాడు. అతడిపై హత్యాయత్నం కేసు, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు వన్‌టౌన్ పోలీసులు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్రమ్ ఒక యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. భార్యతో కలిసి గొల్లాయిగూడెంలో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్ల తర్వాత గొల్లాయిగూడేనికి చెందిన కాలి రాజేష్‌తో ఆ యువతి వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. కొన్ని నెలల పాటు వేరే ప్రాంతానికి వెళ్ళిపోయి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలిసి రాజేష్‌ను హెచ్చరించి అక్రమ్ తిరిగి తంగెళ్ళమూడి ప్రాంతానికి వెళ్ళిపోయాడు. అయినప్పటికీ మళ్లీ రాజేష్, ఆమె కలిసి వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పెద్దల మధ్య రాజీ చేసుకున్నారు. తిరిగి మళ్ళీ రాజేష్ వివాహేతర సంబంధం కొనసాగించడంతో ఒక న్యాయవాది వద్ద వారిద్దరు మాట్లాడుకోడానికి ఏలూరు అంబికా థియేటర్ ప్రాంతానికి ఈనెల 18న రాత్రి వెళ్ళారు. అకస్మాత్తుగా కోడి కత్తి తీసి రాజేష్‌పై దాడి చేశాడు. గాయాలపాలైన రాజేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనా బాషా ప్రాథమికంగా దర్యాప్తు చేసి అక్రమ్‌పై హత్యాయత్నం కేసు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లాడిన భార్యపై వేధింపులు.. దాడి

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వేధించడం ఆపై దాడి చేసిన భర్తపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతినగర్‌లో నివాసం ఉంటున్న మేడిబోయిన దివ్యను కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన సాయి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఒక కుమార్తె కూడా ఉంది. వివాహమైనప్పటి నుంచి దివ్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 12న శాంతి నగర్‌లో ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి దాడి చేశాడు. చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. బాధితురాలు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు దివ్య భర్త సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై దాడి.. బెదిరింపులు

యువతని మాయమాటలతో నమ్మించి, సహజీవనం చేస్తూ డబ్బు కోసం వేధించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు శనివారపుపేటకు చెందిన యువతి ఒక ఆసుపత్రిలో అటెండర్‌గా పనిచేస్తుంది. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కుంపటి రవికుమార్‌కు ఆ యువతితో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఆరేళ్లగా సహజీవనం చేస్తున్నారు. ఇటీవల డబ్బు కోసం ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. ఆమె నిరాకరించడంతో చంపేస్తానని బెదిరించడమే కాకుండా దాడికి పాల్పడ్డాడు. ఆటో డ్రైవర్ కుంపటి రవికుమార్‌పై త్రీ టౌన్ ఎస్ఐ కె ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

TO RENT

★ Commercial land for-lease - 1.5 acres next to highway, with 2 sheds. Near to Veeravalli toll gate - NH 16 Anathapalli, Nallajerla. 8121479669 AJH-35324

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368 AJB -225424

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వెస్ట్ రిలీజ్
శ్రీ పాద ఫిలిమ్స్
నేడే విడుదల

ఏలూరు	సత్యనారాయణ కాంప్లెక్స్
ఏలూరు	SVC మల్టీప్లెక్స్
భీమవరం	పద్మాలయ మినీ
భీమవరం	AVG స్క్రీన్స్
తణుకు	ప్రత్యూష కాంప్లెక్స్
టి.పి గుడెం	శేషమహల్
పాలకొల్లు	అడబాల కాంప్లెక్స్
జంగారెడ్డిగుడెం	శ్రీ పద్మ
నరసాపురం	కనకదుర్గ
చింతలపూడి	రత్న మినీ
నిడదవోలు	గణపతి
ఆకువీడు	విజయ మినీ
కొవ్వూరు	Y స్క్రీన్స్ - 2
మొగల్తూరు	శ్రీ దేవి జానకి - 2
దేవరపల్లి	రామభద్ర
నల్లజర్ల	శ్రీనివాస



రెండు రోజులపాటు వరి కోతలు నిలిపివేయాలి

కుక్కునూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ సిబ్బంది ధాన్యం కల్లాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు బుజ్జిబాబు, తహసీల్దార్ రమేష్‌బాబు, వ్యవసా యాధికారి బాలాజీతో కలిసి మండలంలోని ధాన్యం కల్లాలను పరిశీలించారు. వరి కోతలను రెండురోజుల పాటు విరమించుకోవాలని కోరారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శ్రీధరవేలేరు, తొండిపాక, చీరవల్లి, కుక్కునూరులో ఏర్పాటు చేశామన్నారు.

నేడు బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశం

బుట్టాయగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన ఈ నెల 20న మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల పురోగతిపై ప్రజాప్రతినిధులతో సమీక్ష ఉంటుందని, ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు.



ఎంఈవో రవీంద్ర భారతికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

జీతం బకాయిలు చెల్లించాలి

ఉంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పారిశుధ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతికి వినతి పత్రం అందించారు. జిల్లా కార్యదర్శి కే.విజయలక్ష్మి, సీఐటీయూ మండల అధ్యక్షులు అప్పారావు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

పెదపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఆదికవి నన్నయ్య వర్సిటీ వాలీబాల్ ఉమెన్ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ కం ఇంటర్ వర్సిటీ టీం సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు జరిగే ఎంపికల్లో 12 కళాశాలల నుంచి 140 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఆదికవి నన్నయ్య వర్సిటీ ప్రతినిధి ఎ.స్వాతి, డాక్టరు ఎంబీఎస్వీ ప్రసాద్, సీహెచ్ విశ్వనాథరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరళ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగలిమెట్ట భూమిని సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడెల్లి వెంకట్రావు, సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి డిమాండ్ చేశారు. గురువారం మం డలంలోని ఏపిగుంటలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ సాయి బాబాకు వినతిపత్రం అందచేశారు. మడకం శ్రీను, మడకం రాము, కె.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

పోలవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు వారాలుగా సత్యసాయి మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం సత్యసాయి మంచినీటి కార్మికులు పైపులైన్ల మరమ్మతులు ప్రారంభించారు. యడ్లగూడెం కల్వర్టు సమీపంలో బోదెలోకి నీటి అడుగున్న ఉన్న పైపులైను రంధ్రం పడి నీటి సరఫరా నిలిచిపోయిందని, ప్రత్యామ్నాయంగా అక్కడి పైపు లైన్లను కట్ చేసి కొత్తపైపులు వేసి నీటి సరఫరా పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.



గిరిజన సమస్యలపై మంత్రి లోకేశ్‌కు బొరగం వినతి

పోలవరం డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గురువారం కలిసి గిరిజనుల సమస్యలను వివరించారు. గిరిజన సమస్యలను కూటమి ప్రభుత్వంలోనే సత్వర పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు బొరగం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి పుస్తకాలు, పెన్నులు ఇచ్చి బొరగం సత్కరించారు.

రాష్ట్రంలో 533 సైబర్ కేసులు
ఎంపీ ప్రశ్నకు మంత్రి వెల్లడి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 533 సైబర్ నేరాలపై కేసులు నమోదైనట్టు ఎలక్ట్రానిక్స్, ఐటీ కేంద్ర సహాయ మంత్రి జితిన్ వెల్లడించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశంలో గురువారం ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ఆన్‌లైన్ ద్వారా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. సైబర్ క్రైం ప్రివెన్షన్ పథకం ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయ అందిస్తుందని తెలిపారు.



ఏలూరులో కాంగ్రెస్ నాయకుల నిరసన



జంగారెడ్డిగూడెంలో ప్రజాసంఘాల నాయకుల నిరసన



టి.నరసాపురంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు..
నిరసన

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు ఏలూరులో నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూ టౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తున్నట్టు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకుడు యాగంటి సంజీవ్ తెలిపారు. ఈ మేరకు పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

జంగారెడ్డిగూడెం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఈ పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పట్టణ కన్వీనర్ సూర్యారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, బొడ్డు రాంబాబు, ఎస్‌కె మహబూబ్ సుబానీ, వంగా గోపి తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంటులో అంబేడ్కర్‌ని అవమానించారంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలు ఆందోళన చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగల ఫ్రాన్సిస్, సీపీఎం మండల కమిటీ సభ్యుడు అనుమోలు మురళీ తదితరులు పాల్గొన్నారు.

పజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా..
సుపరిపాలనా వారోత్సవాలు : కలెక్టర్

ఏలూరు సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత మెరుగైన సేవలందించటమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. గురువారం ఉదయం 'ప్రశాసన్ గావ్‌కి ఓర్' సుపరిపాలనపై కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో వివిధ రా ష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమం జరిగింది. న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సంతా చౌహాన్‌లు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. స్థానిక కలెక్టరేట్ చాంబర్ నుంచి కలెక్టర్ కె వెట్రిసెల్వి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపటం ముఖ్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పౌరులకు మెరుగైన సుపరిపాలన సేవలు అందించే క్రమంలో ప్రశాసన్ గావ్‌కి ఓర్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తూ, జవాబుదారీతనం ఉండేలా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రశాసన్ గావ్ కీ ఓర్ క్యాంపెయిన్, గుడ్ గవర్నెన్స్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులతో, మండల స్థాయి వరకు పనిచేసి, సుపరిపాలన నమూనాను ముందుకు తీసుకువెళ్ళటంలో విజయం సాధించిన ప్రభుత్వ విధానాన్ని ప్రజలకు చేరువ చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : చింతమనేని



పెదవేగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో గురువారం జరిగిన కార్య క్రమంలో పలువురు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులు ధాన్యం సొమ్ము కోసం నెలల తరబడి ఎదురుచూసేవారని, ఇప్పుడు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సొమ్ము రైతుల చేతికందుతోందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడకుండా నాణ్యమైన టార్పాలిన్‌లను ప్రభుత్వమే సరఫరా చేసిందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతుకు అండగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పార్టీనాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో విద్యుత్ సమస్యల పరిష్కారం : పత్సమట్ల



భీమడోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలను కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్క రిస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను జడ్పీ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో గృహ విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిం చాలని ఆదేశించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామాజికోద్యమ నాయకుడు జగ్జీవన్‌రామ్ : రోషన్



చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గణిజర్లలో బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సామాజిక ఉద్యమ నాయకుడని, ఉప ప్రధానిగా పనిచేశారని, సమాజంలో అంటరానితనంపై ఉద్యమించారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని సుప్రియస్‌పేట సీఎస్ఐ చర్చి స్త్రీల మైత్రి నిర్వహిస్తున్న ఉమెన్స్ సెమీ క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, టీడీపీ నాయకుడు జే. ముత్తారెడ్డి పాల్గొన్నారు.

రోషన్‌కు ఘన స్వాగతం

లింగపాలెం: ప్రజల కోసం కష్టపడే నాయకుడు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అని పలువురు కూటమి నేతలు అన్నారు. ఇటీవల అమెరికా వెళ్లి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కు మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో ధర్మాజీగూడెంలో స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, గరిమళ్ల చలపతిరావు, గారపాటి బుజ్జయ్య, పాతూరి శ్రీనివాసరావు, మొరంపూడి వరప్రసాద్, కుర్రా సుబ్రమణ్యేశ్వర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక సబ్ జైల్‌ను ఆయన తనిఖీ చేశారు, ఖైదీలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. ఆయన వెంట సబ్ జైల్ అధికారి కృపానందం, సిబ్బంది, న్యాయవాది ఏసుపాదం, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ ఉన్నారు.



వంటలను రుచి చూస్తున్న రత్నప్రసాద్

ఏలూరులో షూటింగ్ సందడి



ఏలూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుషారు చిత్రంలో నటించిన దినేష్ తేజ తాజాగా నటిస్తున్న సినిమా షూటింగ్ ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో జరిగింది. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రాన్ని ఎస్‌కె ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. అర్జున్‌కోలా మొదటిసారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరో యిన్‌గా దాక్షిక నటిస్తున్నారు. ఆమెకు ఇది తొలిచిత్రం. ఇటీవల ముసునూరు మండలం బలివే క్షేత్రం వద్ద షూటింగ్‌ను ప్రారంభించారు. కొద్దిరోజులుగా ఏలూరు పరిసర ప్రాంతాల్లో హీరో, హీరోయిన్లపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మరో పదిరోజుల పాటు ఏలూరు, కొవ్వాక పరిసర ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు నిర్మాత వంశీ చీమకుర్తి తెలిపారు. ఇది థ్రిలర్ మూవీ అన్నారు.

వ్యాయామ కళాశాలకు క్రీడా సామగ్రి వితరణ



దెందులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలకు కోకో గింజల కంపెనీ (క్యాడ్‌బరీ) సంస్థ వ్యాయామ కళాశాలకు రూ. 6 లక్షల విలువగల క్రీడా సామగ్రిని అందించింది. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్‌కు సంస్థ మేనేజర్ రాజేష్ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర కళాశాలలో ప్రిన్సిపాల్‌కు అందజేశారు.



కొఠారు ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న లంక గ్రామాల మహిళలు

కష్టార్జితాన్ని మింగేశారు..
మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద లంక గ్రామస్థుల ఆందోళన

పెదవేగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద కొల్లేరు లంకల గ్రామస్థులు మరోసారి ఆందోళనకు దిగారు. వైసీపీ నాయకుడు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఆయన తండ్రి రామచంద్ర రావు కలిసి తమ కష్టార్జితం మింగేశారని కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు కొద్ది రోజులుగా పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని అబ్బయ్యచౌదరి ఇంటివద్ద ఆందోళన చేసి, ఆపై ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన విషయం విదితమే. తిరిగి గురువారం ఉదయం కొండల రావుపాలెం వచ్చిన ఆయా గ్రామాల మహిళలు అబ్బయ్యచౌదరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడే భోజనాలు చేసి, సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావులు తమ చెరువులకు సంబంధించిన చేపల సొమ్ము రూ.6 కోట్లు తినేశారన్నారు. ఎన్నిసార్లు అడిగినా అధికారాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యంగా వ్యవహరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన ఐదేళ్ళ సొమ్ము ఇచ్చేవరకు ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఐదేళ్ళుగా దిగమింగిన సొమ్మును వడ్డీతో సహా కక్కిస్తామని వారు హెచ్చరించారు. నేతల రవి, సైదు సత్యనారాయణ, ఘంటసాల హరికృష్ణ, ముంగర హరిబాబు, వెంకట సూర్యలక్ష్మి, సైదు కృష్ణలీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు. కాగా కొండలరావుపాలెంలో ఎటువంటి ఘర్షణ జరుగకుండా నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ పోలీస్ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఎమ్మార్ బిల్లుల మంజూరు పరిమితి పెంచాలి



ఏలూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను జిల్లా స్థాయిలో మంజూరు చేయడానికి రూ.50 వేల వరకే పరిమితం చేసిన నిబంధనను సడలించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను విజయవాడలో పీఆర్టీయూ జిల్లా నాయకులు గురువారం కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. వివరాలను ఇక్కడి మీడియాకు సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రూ.50 వేలు పరిమితిని రూ. లక్షకు పెంచాలని, ఆ మేరకు జిల్లాస్థాయిలోనే జిల్లా మెడికల్ బోర్డు వైద్యఖర్చుల బిల్లులను ఆమోదించేలా తగిన ఉత్తర్వులివ్వాలని మంత్రిని కోరారు. ఈహెచ్‌ఎస్ లేదా రీయింబర్స్‌మెంట్‌ద్వారా వైద్యఖర్చుల పరిమితి రూ.2లక్షల వరకే ఉందని, ప్రస్తుతం వైద్యం చాలాఖరీదుతో కూడుకున్నందున ఈ పరిమితిని రూ.10లక్షలకు పెంచాలని అభ్యర్థించారు. మంత్రిని కలిసిన సంఘ నాయకుల్లో ఏసురాజు, రాంబాబు, ముర్సలీన్ తదితరులున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేసిన సీఐడీ
సెక్షన్లు వర్తించవంటూ రిమాండ్‌కి జడ్జి నిరాకరణ

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలువురు వద్ద కోట్లాది రూపాయలను వడ్డీకి తీసుకుని వడ్డీ కట్టకుండా అసలు ఇవ్వకుండా స్కూలు, కాలేజీలలో వాటా ఇస్తానని నమ్మబలికి మోసగించారని అభియోగాలతో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ పోలీసులు కేసులు నమోదు చేశారు. రాజ మహేంద్ర వరం సీఐడీ పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా వారిపై రిమాండ్ రిపోర్టులో విధించిన కేసులు వారికి వర్తించవని కోర్టు వారిని రిమాండ్ చేయడానికి తిరస్కరించడంతో చివరకు 41(ఎ) నోటీస్ ఇచ్చి నిందితులను వదిలివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామవరపుకోట మండలం తడికల పూడిలో ఉన్న హర్షిత పబ్లిక్ స్కూల్ జూనియర్ కాలేజీలను నందిగం రాణి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. పలువురు వద్ద కోట్లాది రూపా యలను వీరు తీసుకుని వారిని మోసగించారనే ఆరోపణలతో పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో అనేక కేసులు వారిపై నమోద య్యాయి. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రెండు రోజుల క్రితం తడికలపూడి హర్షిత స్కూల్‌కి వెళ్లి ప్రిన్సిపాల్ నందిగం రాణికి నోటీస్ ఇచ్చారు. అలాగే మిగిలిన వారికి కూడా నోటీస్ ఇచ్చారు. రాజమహేంద్రవరం సీఐడీ కార్యాలయంలో వారిని విచారిస్తున్నారు. ఈ కేసులో మూడో నిందితుడైన నందిగం ధర్మరాజు, ఏడో నిందితుడైన జి. సురేష్ బాబును గురువారం అరెస్టు చేసి ఏలూరులోని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. మంగ కుమారి ముందు హాజరు పరిచారు. నిందితులపై అభియోగాలతో పేర్కొన్న సెక్షన్ ఈ కేసులో వర్తించవని రిమాండ్ కు నిరా కరించారు. దీంతో సీఐడీ పోలీసులు వారిద్దరికీ 41(ఏ) నోటీసును ఇచ్చి తాము ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని ఆ నోటీసులో పేర్కొని గురువారం సాయంత్రం 6.30 గంటలకు కోర్టు వద్ద వారిని విడిచిపెట్టారు.

దారి గొడవ.. ఆరుగురికి జైలు, జరిమానా

ఉంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారి గొడవ సంఘటనలో తాడేపల్లిగూడెం సెకండ్ అడిషినల్ కోర్టు న్యాయమూర్తి అన్నామణి గురువారం ఆరుగురు నిందితులను ముద్దాయిలుగా నిర్ధారించి జైలు, జరిమనా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి చేబ్రోలు ఎస్సై ఎం.సూర్య భగవాన్ తెలిపిన వివరాల ప్రకారం 2017 జూన్ నెలలో ఉంగుటూరు మండలం వెల్లమిల్లి గ్రామంలో దారి తగవు నేపథ్యంలో పిల్లంగోళ్ల భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కుందేటి శ్రీను, వీరరాఘవులు, అబ్బులు, సరస్వతి, నాగమణి, బ్రహ్మయ్యపై అప్పటి ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అడబాల రవి ప్రసాద్ వాదనలు వినిపించగా సదరు నిందితులను ముద్దాయిలుగా ప్రకటించి మూడో ముద్దాయి కుందేటి అబ్బులుకు 18 నెలల జైలు శిక్ష, రూ. 30 వేల జరిమానా, మిగతా ఐదుగురికి 15 నెలల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు సాక్షులను ప్రవేశ పెట్టిన నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి. సుభాష్, కోర్టు కానిస్టేబుల్ బాలిన లక్ష్మీనారాయణను ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు.

చర్చిల్లో పలువురికి నిత్యావసరాల వితరణ



దెందులూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్, అరవింద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అరవింద్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు చర్చిల్లో క్రైస్తవులకు బియ్యం, నూనె, కందిపప్పు, దుస్తులను ట్రస్టు సభ్యులు పాస్టర్‌లకు క్రైస్తవులకు అందజేశారు. గురువారం నియోజకవర్గంలోని అమ్మపాలెం కొవ్వలి, దెందులూరు వేగవరం గ్రామాల్లో చర్చిల్లో 1500 మందికి సరుకులను అందజేశారు.

మల్బరీ సాగుకు ప్రోత్సాహకాలు

పెదవేగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని పట్టుపరిశ్రమ శాఖ జిల్లా ఉప సంచాలకులు బి.వాణి తెలిపారు. నడిపల్లిలో గురువారం మల్బరీసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మొక్కల కొనుగోలుకు ఎకరానికి రూ.27వేలు, బీసీ, ఓసీలకు రూ.22,500 లు రాయితీ అందిస్తుందని చెప్పారు. అలాగే పక్కా రేరింగ్ షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.05లక్షలు, బీసీ, ఓసీలకు రూ.3,37,500లు ఇస్తుందని, పరికరాల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.67వేలు, బీసీ, ఓసీలకు రూ.56,250లు అందిస్తోందని తెలిపారు. దీంతో పాటు పురుగు నివారణ మందుల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.4,500లు, బీసీ, ఓసీలకు రూ.3750లు రాయితీగా అందిస్తోందని, పట్టుగూళ్ళ కొనుగోళ్ళలోనూ ప్రభుత్వం కిలోకు రూ.50లు రాయితీ ఇస్తోందన్నారు. విజయరాయి పట్టు పరిశ్రమ శాఖాధికారి రంగారావు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలో ఉన్న పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో గురువారం జిల్లాలోని పోలీస్ సిబ్బందికి 17 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి అప్పటికప్పుడే రిపోర్టులను సిబ్బంది వాట్సప్‌కు పంపించారు. ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, ఆసుపత్రి హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రరావు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు చేయాలి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు అందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు సూచించారు. కళాశాలలో నిర్వహించిన ఇంధన పొదుపు దినోత్సవానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ అవసరం లేనిచోట ఫ్యాన్‌లు, టి.విలు, ఏసీలు ఆఫ్ చేసి విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఏడీఈ అహ్మద్‌ఖాన్, ఏఈ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

పెదపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో అమీలు జమ తెలిపారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ సచివాలయాల సిబ్బంది శిక్షణలో ఎంపీడీవో మాట్లాడారు. ఇవోపీఆర్డీ సూర్యకుమార్, ఏవో రవికుమార్, 23 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ వితరణ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ తల్లాడ సత్యనారాయణ ఆశయాలను నెరవేరుస్తానని ఆయన తనయ గీతా నారాయణ్ అన్నారు. గురువారం స్థానిక ఎంబి సోషల్ క్లబ్ నందు తల్లాడ సత్తిపండు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా తన తండ్రి జ్ఞాపకార్థం మానవత సంస్థకు రూ.18 లక్షల విలువైన అంబులెన్సును బహూకరించారు. ముందుగా స్థానిక ఏలూరు రోడ్డులోని సత్తిపండు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించా రు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠ శాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో మంచి మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.9 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.6 వేలు చొప్పున, తృతీయ సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.3వేలు చొప్పున గీతానారాయణ్ చేతులమీదుగా అందచేశారు.అలాగే స్థానిక ఏరియా ఆసుపత్రిలోని సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగుల బంధువులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీసీసీబీ మాజీ చైర్మెన్ కరాటం రాంబాబు, మాజీ ఏఎంసి చైర్మెన్ జెట్టి గురునాధరావు చేతులమీదుగా అంబులెన్సు తాళాలను మానవత సంస్థకు అందజేశారు.

బాబా సన్నిధిలో అన్నసమారాధన

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసంలోని తొలి గురువారం నేపథ్యంలో ఆదివారపుపేటలోని శ్రీ షిరిడీ సాయి ప్రేమ మందిర్ వద్ద ఆలయ శాశ్వత ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తొలుత బాబాకు అభిషేకాలు, అర్చనలు జరిపారు.

పొగాకు పంట ధ్వంసం

జీలుగుమిల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి శివారు చంద్రమ్మకాలనీలో పొగాకు పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు గిరిజనులు మడకం లక్ష్మీ, చిర్రి లక్ష్మీ, బద్దె నాగలక్ష్మీ, మడకం కృష్ణ, మడకం జగదాంబ ఫిర్యాదు చేశారు. చిర్రివారిగూడెంకు చెందిన పది మంది గిరిజనులకు చంద్రమ్మ కాలనీలో సర్వే నెం. 160లో ఒక్కొక్కరికి ఎకరం 25సెంట్లు చొప్పున 13 ఎకరాల భూమి ఉందని తాము పొగాకు పంట సాగు చేసుకుంటున్నామన్నారు. 14వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొగాకు తోట ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. దీనిపై ఎస్సై పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ సంఘటనపై విచారణ జరుపుతామన్నారు.

సారా స్వాధీనం

చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాతిమాపురంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించగా తలార్లపల్లికి చెందిన ఇస్లావత్ కొండ అనే వ్యక్తి పది లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. దాడిలో ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్ పాల్గొన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ, గుండుగొలను గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం
భూములు సేద్యము మరియు చేపల చెరువు లైసెన్స్ హక్కునకు టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన
ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, గుండుగొలను గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానమునకు చెందిన ఈ దిగువ తెలిపిన చేపల చెరువులో చేపల పెంపకము చేసుకొను లైసెన్స్ హక్కునకు అప్పగించిన తేది నుండి 3 సం.కాలమునకు గాను దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున ది. 28-12-2024 శనివారం మధ్యాహ్నం 02.30లకు ఆలయం నందు వేలం పాట జరుగును. ఆసక్తి గలవారు వేలం పాటనందు పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

క్ర. సం.	సర్వే నెం.	విస్తీర్ణము	ధరావత్తు సొమ్ము	వేలం పాట జరుగు తేది	కౌలు కాలం
1	695/2 [illegible]	7-80	35,000/-	28.12.2024 శనివారం మ.2.30 గం.లకు	అప్పగించిన తేది నుండి 3 సం.లు 2024-25 నుండి 2026-27
2	708/1,2 [illegible]	2-25	2,000/-	28.12.2024 శనివారం మ.2.30 గం.లకు	

ఇతర వివరములకు మరియు నిబంధనలకు కార్యాలయం పనివేయు వేళలలో ఈ క్రింది వారిని సంప్రదించగలరు.
గుండుగొలను ది.17-12-2024 | కె. గంగరాజకుమార్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ | సం/-కె.ఎమ్.వంశీ కార్యనిర్వహణాధికారి, సెల్ : 7981456461

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

ద్వారకాతిరుమలలో దుకాణదారులకు నోటీసులు



ద్వారకాతిరుమలలో దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రం వద్ద పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. పారిశుధ్యం మెరుగుపరిచే దిశగా ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయాలు నిలిపి వేయాలని సూచించారు. వాటి వల్ల నష్టాలను దుకాణయ జమానులకు గ్రామ కార్యదర్శి జిటి శ్రీనివాస్, మహిళా పోలీసు పి.లక్ష్మీసుజన తదితరులు వివ రించారు. భూమిలో చేరి పర్యావరణానికి తీరని నష్టం కలుగచేస్తాయన్నారు. చిరు వ్యాపారులు 20 మిల్లీ మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ సంచులను వినియోగించవద్దని సూచించారు. చిన్న వెంకన్న పుణ్యక్షేత్రానికి వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, వారి అవసరాలకు మందమైన కవర్లు, వస్తువులు వాడాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లీశ్వరి, నరేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.



కొఠారు ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న లంక గ్రామాల మహిళలు

కష్టార్జితాన్ని మింగేశారు..

మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద లంక గ్రామస్థుల ఆందోళన

పెదవేగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద కొల్లేరు లంకల గ్రామస్థులు మరోసారి ఆందోళనకు దిగారు. వైసీపీ నాయకుడు, దెందు లూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు కలిసి తమ కష్టార్జితం మింగేశారని కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు కొద్ది రోజులుగా పెదవేగి మండలం కొండలరావు పాలెంలోని అబ్బయ్యచౌదరి ఇంటివద్ద ఆందో ళన చేసి, ఆపై ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన విషయం విదితమే. తిరిగి గురువారం ఉదయం కొండల రావుపాలెం వచ్చిన ఆయా గ్రామాల మహిళలు అబ్బయ్యచౌదరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడే భోజ నాలు చేసి, సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావులు తమ చెరువులకు సంబం ధించిన చేపల సొమ్ము రూ.6 కోట్లు తినేశార న్నారు. ఎన్ని సార్లు అడిగినా అధికారాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యంగా వ్యవహరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తమకు రావా ల్సిన ఐదేళ్ళ సొమ్ము ఇచ్చేవరకు ఆందోళనను కొనసాగి స్తామన్నారు. ఐదేళ్ళుగా దిగమించిన సొమ్మును వడ్డీతో సహా కక్కిస్తామని వారు హెచ్చరించారు. నేతల రవి, సైదు సత్యనారాయణ, ఘంటసాల హరికృష్ణ, ముంగర హరిబాబు, వెంకట సూర్యలక్ష్మి, సైదు కృష్ణలీల, నాగమణి తదిత రులు పాల్గొన్నారు. కాగా కొండలరావుపాలెంలో ఎటువంటి ఘర్షణ జరుగకుండా నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ పోలీస్ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

మెడికల్ బిల్లుల మంజూరు పరిమితి పెంచాలి



ఏలూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లు, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను జిల్లా స్థాయిలో మంజూరు చేయడానికి రూ.50 వేల వరకే పరిమితం చేసిన నిబంధనను సడలించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను విజయవాడలో పీఆర్టీయూ జిల్లా నాయకులు గురువారం కలుసుకుని వినతి పత్రాన్ని అందజేశారు. వివరాలను ఇక్కడి మీడియాకు సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రూ.50 వేలు పరిమితిని రూ. లక్షకు పెంచాలని, ఆ మేరకు జిల్లా స్థాయిలోనే జిల్లా మెడికల్ బోర్డు వైద్యఖర్చుల బిల్లులను ఆమోదించేలా తగిన ఉత్తర్వులివ్వాలని మంత్రిని కోరారు. ఈహెచ్ఎస్ లేదా రీయింబర్స్‌మెంట్ ద్వారా వైద్యఖర్చుల పరిమితి రూ.2 లక్షల వరకే ఉందని, ప్రస్తుతం వైద్యం చాలా ఖరీదుతో కూడుకున్నందున ఈ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని అభ్యర్థించారు. ఏసురాజు, రాంబాబు తదితరులున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేసిన సీఐడీ

సెక్షన్లు వర్తించవంటూ రిమాండ్‌కి జడ్జి నిరాకరణ

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలువురు వద్ద కోట్లాది రూపాయలను వడ్డీకి తీసుకుని వడ్డీ కట్టకుండా అసలు ఇవ్వకుండా స్కూలు, కాలేజీలలో వాటా ఇస్తానని నమ్మబలికి మోసగించారని అభియోగాలతో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ పోలీసులు కేసులు నమోదు చేశారు. రాజ మహేంద్ర వరం సీఐడీ పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా వారిపై రిమాండ్ రిపోర్టులో విధించిన కేసులు వారికి వర్తించవని కోర్టు వారిని రిమాండ్ చేయడానికి తిరస్కరించడంతో చివరకు 41(ఎ) నోటీస్ ఇచ్చి నిందితులను వదిలివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామవరపుకోట మండలం తడికలపూడిలో ఉన్న హర్షిత పబ్లిక్ స్కూల్ జూనియర్ కాలేజీలను నందిగం రాణి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. పలువురు వద్ద కొట్లాది రూపాయలను వీరు తీసుకుని వారిని మోసగించారనే ఆరోపణలతో పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో అనేక కేసులు వారిపై నమోదయ్యాయి.

దీనిలో భాగంగా రాజ మహేంద్రవరం సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రెండు రోజుల క్రితం తడికలపూడి హర్షిత స్కూల్‌కి వెళ్లి ప్రిన్సిపాల్ నందిగం రాణికి నోటీస్ ఇచ్చారు. అలాగే మిగిలిన వారికి కూడా నోటీస్ ఇచ్చారు. రాజమహేంద్ర వరం సీఐడీ కార్యాలయంలో వారిని విచారిస్తు న్నారు. ఈ కేసులో మూడో నిందితుడైన నందిగం ధర్మరాజు, ఏడో నిందితుడైన జి. సురేష్ బాబును గురువారం అరెస్టు చేసి ఏలూరులోని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. మంగ కుమారి ముందు హాజరు పరిచారు. నిందితులపై అభియోగాలతో పేర్కొన్న సెక్షన్ ఈ కేసులో వర్తించవని రిమాండ్ కు నిరా కరించారు. దీంతో సీఐడీ పోలీసులు వారిద్దరికీ 41(ఏ) నోటీసును ఇచ్చి తాము ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని ఆ నోటీసులో పేర్కొని గురువారం సాయంత్రం 6.30 గంటలకు కోర్టు వద్ద వారిని విడిచిపెట్టారు.

అశ్లీల నృత్యాల కేసులో నిందితుల అరెస్టు

నిడమర్రు, డిసెంబరు 19: బావాయిపాలెం రైస్‌మిల్లులో అశ్లీల నృత్యాలు చేస్తున్న కేసును పోలీసులు 24 గంటల్లో నిందితులను అరెస్టు చేశారు. సీఐ సుభాష్, ఎస్ఐ ఎన్.వీరప్రసాద్ వివరాలు తెలిపారు. బావాయిపాలెం రైస్ మిల్లులో ఈ నెల 15న వాకమూడి ఇంద్రకుమార్ పుట్టినరోజు వేడుకలలో అశ్లీల నృత్యాలు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో 22 మంది స్థానికులు కాగా, ఇద్దరు నిర్వాహకు లు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

వివాహేతర సంబంధం ఉందని..

కోడి కత్తితో దాడి.. హత్యాయత్నం

ఏలూరు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో ఒక యువకుడు వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుండడంతో పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికి సంబంధం కొనసాగించడంతో అకస్మాత్తు గా కోడి కత్తి తీసి దాడి చేశాడు. అతడిపై హత్యాయత్నం కేసు, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు వన్‌టౌన్ పోలీసులు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్రమ్ ఒక యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. భార్యతో కలిసి గొల్లాయిగూడెంలో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్ల తర్వాత గొల్లాయిగూడేనికి చెందిన కాలి రాజేష్‌తో అక్రమ్ భార్య భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. కొన్ని నెలల పాటు వేరే ప్రాంతానికి వెళ్ళిపోయి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలిసి రాజేష్‌ను హెచ్చరించి అక్రమ్ తిరిగి తంగెళ్ళమూడి ప్రాంతానికి వెళ్ళిపోయాడు. అయినప్పటికీ మళ్ళీ రాజేష్ అక్రమ్ భార్య వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో పెద్దల మధ్య రాజీ చేసుకున్నారు. తిరిగి మళ్ళీ రాజేష్ వివాహేతర సంబంధం కొనసాగించడంతో ఒక న్యాయవాది వద్ద వారిద్దరు మాట్లాడుకోవడానికి ఏలూరు అంబికా థియేటర్ ప్రాంతానికి ఈనెల 18న రాత్రి వెళ్ళారు. అకస్మాత్తుగా కోడి కత్తి తీసి రాజేష్‌పై దాడి చేశాడు. గాయాలపాలైన రాజేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వ ర్యంలో ఎస్ఐ మదీనా బాషా ప్రాథమికంగా దర్యాప్తు చేసి అక్రమ్‌పై హత్యాయత్నం కేసు, ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలి



చెక్కపల్లిలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఏవో మధుమోహన్

ముసునూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో మండలంలో అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతున్న నేపథ్యంలో రైతులు కల్లాల్లో ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని ఏవో ఎస్.మధుమోహన్ సూచించారు. చెక్కపల్లి, సూరేపల్లి, గోపవరం, లోపూడి తదితర గ్రామాల్లో కల్లాలపై ఉన్న ధాన్యపు రాశుల ను గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని, కోతలు నిలిపివేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రా లకు తరలించి విక్రయించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అన్ని రైతుసేవా కేంద్రాల్లో సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాతావరణం పరిస్థితు లను బట్టి వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వీహెచ్ఏలు పాల్గొన్నారు.

● చాట్రాయి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు కల్లాలపై ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శివశంకర్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కల్లాలను ఏవో పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కల్లాలపై ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు తరలించి టార్పాలిన్ పట్టాలు కప్పాలని, త్వరితగతిన ఆర్బీకేల ద్వారా మిల్లుకు తరలించాలని, వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

చాట్రాయి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ సూరంపాలెంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. మాలల కోర్ కమిటీ సభ్యుడు నక్కా రాము మాట్లాడుతూ అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చెయ్యాలన్నారు. నాయకులు దార్ల సురేష్ బాబు, వినోద్‌కుమార్, బ్రహ్మయ్య, శివ, మొండ్రు రాము, వసంతరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ముసునూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తమ శర్మ అన్నారు. వేల్పుచర్లలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల అర్జీలను శర్మ స్వీకరించారు. గ్రామసభలో వివిధ భూసమస్యల పై 8 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ దీపిక, వీఆర్వో నవీన్‌కుమార్, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోతనపల్లి తండాలో గురువారం ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. దారావత్తు శ్రీను వద్ద 700 లీటర్ల బెల్లం ఊటను పట్టుకొని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ వాయిదా వేయాలి

చాట్రాయి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణను రెండు వారాల పాటు వాయిదా వెయ్యాలని ఎస్టీయూ జిల్లా నాయకులు జి.రాము, మహబూ, అమరయ్య, నరశింహారావు కోరారు. ఈనెల 23 నుంచి 27 వరకు శిక్షణకు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, క్రిస్మస్, నూతన సంవత్సరం పండుగలను పురస్కరించుకొని రెండు వారాలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గ్రామ సచివాలయం వద్ద పేదల నిరసన



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేదలు

చాట్రాయి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా సాగు చేసుకుంటున్న అటవీ, బంజరు భూములకు పట్టాలు మంజూరు చెయ్యాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగొలనుపేట సచివాలయం వద్ద సాగుదారులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేత చాట్ల బాబూరావు మాట్లాడుతూ ఆరుగొలనుపేట పరిధిలో చిత్తపూరుకు చెందిన సుమారు 300 పేదలు సాగుదారులు ఇక్కడ జరిగే రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇవ్వటానికి రాగా తుఫాను వలన సదస్సు రద్దు అయ్యిందని సిబ్బంది చెప్పారన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు చిలకమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల భారం ఉపసంహరించాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంట్ చార్జీలను రద్దుచేయాలని కోరుతూ పల్లెర్లమూడిలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎటువంటి భారాలు మోపబోమని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ ప్రజలపై మాత్రం భారాలు మోపుతున్నారని విమర్శించారు. పాలేటి సుభాష్ చంద్రబోస్, సామేలు, శ్రీమన్నారాయణ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

హిల్ ప్యారడైజ్‌లో బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దాతలు

నూజివీడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల పరిధిలోని తోటపల్లి హిల్ ప్యారడైజ్‌లో రూ.30 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి రూ.10 కోట్లు విరాళం అందించిన తిప్పనగుంటకు చెందిన ఎన్నారై డాక్టర్ కాజ బాబు, కాజ జానకి శంకుస్థాపన చేశారు. అనంతరం హిల్ ప్యారడైజ్‌లోని ఎలిజిబెత్ లెగసీ ఆఫ్ హూప్ హిల్ కృత్రిమ అవయవ కేంద్రంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. ఈ కార్యక్ర మంలో హిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, హిల్ ఇండియా చైర్మన్ రామావతార్ యాదవ్, సీఈవో కె అజయ్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నున్న ఇజయ్, ప్రముఖ దాత శ్రీనివాసరావు, హిల్ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కామినేని



కలిదిండి రైతు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కలిదిండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండి మార్కెట్ ఆవరణలో గురువారం ఆర్డీవో అచ్యుత అంబరీష్‌తో కలసి మండల రైతు సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల్లో చేర్చబడిన మిలటరీ భూములు, మద్దాల రంగనాయకుల భూములతోపాటు పలు గ్రామాల్లో ఉన్న భూములను 22ఏ నుంచి తొలగించి వచ్చే ఏడాది వినాయక చవితిలోగా ఆ భూములకు పట్టాలు మంజూరు చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కొండూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, సర్పంచ్ బొర్రా వెంకటలక్ష్మి, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వో పమిడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల ఉన్నతికి ప్రభుత్వం కృషి..

మండవల్లి : ఆక్వారైతులు ఉన్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండవల్లి మండలం లోకుముడిలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఆక్వారైతులు సమస్యలను మొర పెట్టుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కైకలూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ రోగికి మెరుగైన వైద్యాన్ని అందించి ప్రభుత్వాస్పత్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. 50 పడకల ఆస్పత్రిగా మార్పు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పూనుకొల్లు వెంకటరమణ, సభ్యులుగా తానా ప్రసాద్, మన్యం శ్రీను, రమాదేవి తదితరులను నియమించినట్లు తెలిపారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కలిదిండిలో ప్రజా సంఘాల ధర్నా

కలిదిండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో అమిత్ షా అంబేడ్కర్ గురించి అవమానకరంగా మాట్లాడాన్ని నిరసిస్తూ గురువారం కలిదిండి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు పి.ప్రకాష్, సిహెచ్.శ్రీకాంత్, మాధవరావు, నాగేంద్రరావు, జ్ఞానేసు, పి.సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.



కవి బెనర్జీని సన్మానిస్తున్న ప్రముఖులు

కవి బెనర్జీకి ఘన సత్కారం

కైకలూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో దేశమా మేలుకో అనే శీర్షికతో కవతాగానం చేసిన కైకలూరుకు చెందిన కవి దండే బెనర్జీని ఘనంగా సన్మానించారు. ఇటీవల కర్నూలు జిల్లా మంత్రాలయంలో పరిమళ విద్యానికేతన్ ఆడిటోరియంలో ఐఎస్‌వో సర్టిఫైడ్ చేసిన 42వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఆయన చేసిన కవితాగానం విశేషంగా ఆకట్టుకుంది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఈశ్వరీభూషణం, పార్థసారధి, కర్నూలు నిర్వాహక కమిటీ కవి బెనర్జీని ప్రశాంసా పత్రం, మెమెంటోతో సత్కరించారు.

హుండీల ఆదాయం రూ.22 లక్షలు

ముదినేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాదేవి, గుడివాడ డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో గత 70 రోజుల హుండీలు లెక్కించగా, రూ.22.05 లక్షల నగదు, 20 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి ఆదాయంగా లభించింది. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, వెనిగళ్ల సురేష్, పరసా కృష్ణ, సోవమ్మ, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, నాగ వెంకట రాధాకృష్ణ, పరసా రమేష్, వీఆర్వోలు రామసుబ్బయ్య, ఏడుకొండలు లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



కూరగాయలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నూజివీడు టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుబజారులో కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించబోమని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. రైతు బజారుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు సారథి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్‌కు సూచించారు.

నేడు మెగా జాబ్‌మేళా

ముసునూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం జరిగే మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.రాణి కోరారు. తమ ధ్రువీకరణపత్రాలతో ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.

పేదల సంక్షేమానికి టీడీపీ కృషి

ముసునూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమంతో పాటు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు టీడీపీ కృషిచేస్తోందని క్లస్టర్ ఇన్‌చార్జి గార్లపాటి నరసింహారావు అన్నారు. ముసునూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగుస్తోందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటివరకు సుమారు 1500 సభ్యత్వాలు చేసినట్లు నరసింహారావు తెలిపారు.

ఇంధనం పొదుపు చేయాలి

నూజివీడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన వారోత్సవాల సందర్భంగా నూజివీడులో విద్యుత్‌శాఖ ఉద్యోగులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఈఈ ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ భావితరాలకు విద్యుత్‌కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సౌరశక్తిని విద్యుత్‌శక్తిగా వినియోగించుకోవాలన్నారు. నేటి సంకల్పం రేపటి వెలుగుకు సహకారం కావాలని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సూర్యఘర్ పథకాన్ని ఇందుకు వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈలు దుర్గారావు, పోతురాజు, ఏఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్నపై కత్తెర పురుగు

చాట్రాయి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశిస్తుందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శివశంకర్ సూచించారు. చాట్రాయిలో మొక్కజొన్న తోటలను గురువారం ఏవో పరిశీలించారు. కత్తెర పురుగు తలపై తిరగబడిన వై ఆకారం, పురుగు చివరన 4 చుక్కలు ఉంటాయన్నారు. ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జి 0.5 గ్రాములు 1 లీటరు నీటికి, లేదా సైనోశాడ్, స్పైన్‌టొరామే మందులు వాడి కత్తెర పురుగును నివారించవచ్చన్నారు.

రద్దు కానున్న గురజ హైస్కూల్ ప్లస్ కళాశాల!

ముదినేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గురజలో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది. 2022 -23 విద్యాసంవత్సరంలో గురజ జడ్పీ హైస్కూల్‌లో ఈ హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఆ విద్యాసంవత్సరంతో పాటు 2023-24 విద్యా సంవత్సరంలోను ఒక్క అడ్మిషన్ జరగలేదు. అదే హైస్కూల్‌లో పదో తరగతి పాసైన బాలికలు ప్రైవేట్ కళాశాలలు, ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరారే తప్ప గ్రామంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కళాశాలలో ఒక్కరూ చేరలేదు. హైస్కూల్ ప్లస్ కళాశాలను ఏర్పాటు చేశారే తప్ప అందుకు అవసరమైన మౌలిక సదు పాయాలను, అధ్యాపకులను నియమించలేదు. ఈక్రమంలో గురజ హైస్కూల్‌లో ప్లస్ కళాశాల రద్దు కానున్నట్టు తెలిసింది.



పెడన ఎమ్మెల్యే కాగితను సత్కరిస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు, టీడీపీ నేతలు

ఎమ్మెల్యే కాగితను కలసిన నీటి సంఘాల అధ్యక్షులు

ముదినేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గంలోని కమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఉన్న ముదినేపల్లి మండలం వాడవల్లి, వణుదుర్రు సాగునీటి సంఘాల అధ్యక్షులు సూదా బత్తుల సుధాకర్, పోసిన పాండురంగారావు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు శోభనాద్రి చౌదరి, జిల్లా పశుగణా భివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నాగేంద్ర కుమార్‌లతో కలసి ఎమ్మెల్యే కాగితను సత్కరించారు.

సీసీ కెమెరాలపై అవగాహన

కైకలూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని, మహిళా పోలీసులు పూర్తి అవగాహన కలిగి యుండాలని కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవి కుమార్ అన్నారు. కైకలూరు పోలీసుస్టేషన్లో నియోజకవర్గంలోని ఐదు పోలీసుస్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న సచివాలయ మహిళా పోలీసులకు సీసీ కెమెరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐలు రామచంద్రరావు, రాంబాబు పాల్గొన్నారు.